మద్యం టెండర్లపై కూటమి నేతల పెత్తనం

- ఆన్‌లైన్‌లో దరఖాస్తులపై ఆంక్షలు
- ఏలూరు సర్కిల్‌లో 24 టెండర్ల దాఖలు
- ఈనెల 9 వరకు దరఖాస్తులకు గడువు


ఏలూరు ఎక్సైజ్ సర్కిల్ స్టేషన్‌లో టెండర్లు సమర్పించేందుకు ఏర్పాటుచేసిన స్పెషల్ డెస్క్

ఏలూరు టౌన్: మద్యం టెండర్లపై కూటమి సర్కారు ప్రత్యేక దృష్టి సారించింది. ఎమ్మెల్యేలు, నేతల హవా కొనసాగుతోంది. తమ కనుసన్నల్లోనే టెండర్లు వేసేలా ఇప్పటికే ఎక్సైజ్ అధికారులకు మౌఖిక ఆదేశాలు ఇచ్చినట్టు తెలుస్తోంది. ఒకవేళ తమను కాదని టెండర్లు వేసిన ప్రైవేటు వ్యక్తులు మద్యం దుకాణాలు ఎలా ఏర్పాటు చేస్తారో చూస్తామనే రీతిలో ముందుగానే హెచ్చరికలు జారీ చేస్తున్నారు. దీంతో నూతన మద్యం పాలసీలో ప్రైవేటు మద్యం దుకాణాల ఏర్పాటుకు వ్యాపారులు టెండర్లు దాఖలు చేసేందుకు పెద్దగా ఆసక్తి చూపించటంలేదు.

గోప్యతపై సర్వత్రా విమర్శలు

ప్రైవేటు మద్యం షాపుల ఏర్పాటుకు టెండర్లు దాఖలు చేసేందుకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాన్ని అవలంభిస్తున్నారు. ఏలూరు జిల్లాలో ఏడు ఎక్సైజ్ సర్కిళ్ల పరిధిలో ఆయా కార్యాలయాల వద్ద ఆఫ్‌లైన్‌లో టెండర్లు దాఖలు చేసేందుకు ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేశారు. కూటమి నేతల భయంతో ఎవరూ ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించేందుకు సాహసం చేయటంలేదని చెబుతున్నారు. ఇక ఆన్‌లైన్‌లో టెండర్లు దాఖలు చేస్తే ఎవరు వేశారో.. దేనికి టెండర్ వేశారో అనే విషయాలు తెలియని గందరగోళ పరిస్థితి ఉంది. జిల్లాలో ఎక్సైజ్ అధికారులకు సైతం ఆన్‌లైన్‌లో టెండర్లు వివరాలు కనిపించకపోవటం గమనార్హం. ఆన్‌లైన్ దరఖాస్తుల వివరాల గోప్యతపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. టెండర్లు లాటరీ తీసే సమయానికి తమకు రాకుండా కూటమి నేతలే అడ్డుపడి అధికారులతో టెండర్లు తిరస్కరించే అవకాశం ఉందని వాపోతున్నారు.

24 టెండర్ల దాఖలు

ఏలూరు ఎక్సైజ్ శాఖ సర్కిల్ పరిధిలో ఏలూరు, దెందులూరు నియోజకవర్గాలు ఉన్నాయి. ఏలూరు అర్బన్‌లో 21 మద్యం షాపులు, రూరల్‌లో 5, దెందులూరు నియోజకవర్గంలో దెందులూరు 4, పెదపాడు 5, పెదవేగి 6 మద్యం షాపులు ఏర్పాటుకు టెండర్లు వేసేందుకు మద్యం వ్యాపారులు పోటీ పడుతున్నారు. ఈనెల 2న టెండర్లు వేసేందుకు అధికారులు గెజిట్ విడుదల చేయగా, నాలుగు రోజులకు ఏలూరు సర్కిల్‌లో 24 దరఖాస్తులు వేసినట్టు ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. 6 మద్యం దుకాణాలకు మాత్రమే 24 దరఖాస్తులు వచ్చినట్టు తెలిపారు.

పారదర్శకంగా టెండర్లు



ఏలూరు జిల్లాలో ప్రైవేటు మద్యం షాపుల ఏర్పాటుకు పారదర్శకంగా టెండర్లు వేసేలా చర్యలు చేపట్టాం. ఎక్కడా పొరపాట్లకు తావులేకుండా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో టెండర్లు సమర్పించేందుకు అవకాశం కల్పించాం. ఈనెల 9వ తేదీ వరకు టెండర్లు దాఖలు చేసేందుకు గడువు ఉంది. ఈనెల 11న ఏలూరు మినీబైపాస్ రోడ్డులోని చలసాని గార్డెన్స్‌లో లాటరీ తీసి మద్యం షాపులను కేటాయించేలా చర్యలు చేపట్టాం.

– ఆవులయ్య, ఏలూరు జిల్లా ఎక్సైజ్ అధికారి

7న పాలస్తీనా సంఘీభావ దినం

ఏలూరు (టూటౌన్): గాజాపై ఇజ్రాయేల్ ఆటవిక దాడులు తక్షణమే ఆపాలని కోరుతూ అక్టోబర్ 7న పాలస్తీనా సంఘీభావ దినంగా పాటించాలని జిల్లాలో ఉన్న వామపక్ష పార్టీలు ప్రజలకు పిలుపునిచ్చాయి. స్థానిక సీపీఐ కార్యాలయంలో వామపక్ష పార్టీల సమావేశం శనివారం నిర్వహించారు. సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు ఎ రవి, మన్నవ కృష్ణచైతన్య, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, సీపీఐఎంఎల్, న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు, ఎంసీపీఐ జిల్లా నాయకులు బద్దా వెంకట్రావు, బాషా, తలారి ప్రకాష్, ఎస్ నాగరాజులు మాట్లాడారు. గతేడాది అక్టోబర్ 7 నుంచి ఇజ్రాయేల్ హమాస్ దాడికి ప్రతీకార దాడి పేరుతో పాలస్తీనాపై విచక్షణారహితంగా దాడులకు పాల్పడుతుందని విమర్శించారు. ఇజ్రాయేల్ ఈ యుద్ధోన్మాద చర్యలు జాతి నిర్మూలనకు దారితీస్తుందని ఏడాది జనవరిలో అంతర్జాతీయ న్యాయస్థానం వ్యాఖ్యానించిందని గుర్తుచేశారు. ఏలూరులో 7వ తేదీ ఉదయం 10 గంటలకు పాత బస్టాండు అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగే నిరసన కార్యక్రమంలో ప్రజలంతా పాల్గొనాలని విజ్ఞప్తి చేశాయి.

మైక్రో ఆర్ట్స్ ఎవరైనా నేర్చుకోవచ్చు


శిక్షణ పొంది సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో అతిథులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): బియ్యం గింజలపై అక్షరాలు రాయడం, అగ్గిపుల్లలపై బొమ్మలు గీయడం వంటి మైక్రో ఆర్ట్స్ పిల్లలు, పెద్దలు ఎవరైనా నేర్చుకోవచ్చని హేలాపురి బాలోత్సవం ఆహ్వాన సంఘం అధ్యక్షుడు ఆలపాటి నాగేశ్వరరావు అన్నారు. మూడు రోజుల దసరా మైక్రో శిక్షణ శిబిరం ముగింపు సభ స్థానిక ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న నాగేశ్వరరావు మాట్లాడుతూ పిల్లలు, పెద్దల్లో సునిసిత, సృజనాత్మకత పెంచేందుకు మైక్రో ఆర్ట్స్ శిక్షణ దోహదపడుతుందన్నారు. ఇదొక ప్రత్యేక శిబిరమని, ఇందులో భాగస్వాములైన వారికి, శిక్షకులకు ధన్యవాదాలు తెలిపారు. ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ ప్రతి రోజూ సాయంత్రం నాలుగు గంటలకు ఏఆర్‌డీజీకే హై స్కూల్‌లో కర్రసాము శిక్షణ, 5 గంటలకు కరాటే శిక్షణ కూడా ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ శిక్షణ తమకు ఎంతో తోడ్పడిందని శిక్షణ పొందిన సుమారు 100 మంది విద్యార్థులు తెలిపారు. సభకు హేలాపురి బాలోత్సవం ట్యూషన్ సెంటర్స్ సమన్వయ కర్త కె.జనని స్వాగతం పలికారు. శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనపర్చిన వారిని అభినందించి, వారికి సర్టిఫికెట్లు, జ్ఞాపికలు బహూకరించారు. బియ్యం గింజలపై అక్షరాలు రాయడం నేర్పిన దోరశివప్రసాద్, అగ్గిపుల్లలపై బొమ్మలు చెక్కడం నేర్పిన మేతర సురేష్ బాబులను సత్కరించారు.

ఇందిరమ్మ కాలనీల్లో రోడ్లు నిర్మించాలి


పార్టీ జెండాను ఎగురవేస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): నగరంలోని 19 డివిజన్ సుందరయ్య కాలనీ, శ్రీనివాస్ నగర్, గ్రీన్ సిటీ, కొత్తూరు ఇందిరమ్మ కాలనీల్లో రోడ్లు వేయాలని సీపీఎం హనుమాన్ నగర్, 19వ డివిజన్ శాఖ సభ డిమాండ్ చేసింది. స్థానిక సుందరయ్య కాలనీ సీపీఎం ఆఫీసులో 19 డివిజన్ హనుమాన్ నగర్ సీపీఎం శాఖ సభ చల్లా పైడియ్య అధ్యక్షతన శనివారం నిర్వహించారు. సభలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల స్థానిక సమస్యలను పట్టించుకోకుండా, డైవర్ట్ రాజకీయాలకు పాల్పడుతోందని విమర్శించారు. రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను పక్కదారి పట్టించే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. డిప్యూటీ సీఎం హోదాలో ఉన్న పవన్ కళ్యాణ్ రాష్ట్రంలో ఇంకా ఏ సమస్యలేనట్టు తిరుపతి లడ్డూ కల్తీ గురించే మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. లడ్డూ వ్యవహారంలో మత ఉద్రిక్తతలు కలిగించేలా రెచ్చగొట్టే వ్యాఖ్యలు డిప్యూటీ సీఎం హోదాలో పవన్ చేయటం హేయమైన చర్య అని అన్నారు. కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారం రావడంతో లౌకిక రాజ్యాంగం రద్దు చేసే ప్రయత్నాలు మొదలు పెట్టిందని విమర్శించారు. భారతదేశ ఫెడరల్ వ్యవస్థను దెబ్బకొట్టే విధంగా జమిలి ఎన్నికల పేరుతో ముందుకొస్తోందని అన్నారు. బీజేపీ ప్రభుత్వానికి మద్దతిస్తున్న టీడీపీ, జనసేన పార్టీలు భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. శాఖ కార్యదర్శి వి.సాయిబాబు గత మూడు సంవత్సరాల కాలంలో జరిగిన కార్యకలాపాలపై నివేదికను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా పార్టీ కార్యదర్శిగా ఎ.గంగాధరరావు, శాఖ సభ్యులుగా పి.సత్తిరాజు, ఆర్ నరసింహమూర్తి, పిల్లి గురుమూర్తి, ఎ.గంగాధర్ రావు, కె.చిన్నారావు, కె.నాగమణి, వి.లక్ష్మీకుమారి, ఎం గౌరీలను ఎన్నుకున్నారు.

తెలుగు అభివృద్ధికి పట్టుగొమ్మలు కళా సంస్థలు


కేవీఎస్ సాహిత్య పురస్కారాలు ప్రదానం చేస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): తెలుగు భాషాభివృద్ధికి కళా సంస్థలు పట్టుగొమ్మలని, ఈ తరానికి చెందిన వారు తెలుగు భాష అభ్యున్నతికి కృషి చేయాల్సిన అవసరం ఉందని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ పిలుపునిచ్చారు. నగరానికి చెందిన సాహిత్య మండలి, కేవీఎస్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక రామకృష్ణాపురంలోని సాహిత్య మండలి ప్రాంగణంలో శనివారం నిర్వహించిన శరన్నవరాత్రుల సాహిత్యోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కూచిపూడి నృత్య దర్శకులైన కేవీ సత్యనారాయణ ప్రపంచ వ్యాప్తంగా బహు శిష్యులను కలిగిన గురువుగా ఖ్యాతిగాడించారని, వీరు ప్రతి ఏటా నృత్య, సాహిత్య, సంగీత రంగాలలో విశిష్టమైన వారికి అవార్డులను బహుకరించడం ఎంతో గొప్ప పరిణామమని కొనియాడారు. అనంతరం మడుపల్లి మోహన్ గుప్తా సౌజన్యంతో ఏర్పాటు చేసిన తాతా సందీప్ శర్మ అష్టావధానం ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగింది. ప్రముఖ అవధాని 'పద్యకళాతపస్వి' ఆచార్య ధూళిపాళ మహాదేవమణికి, 2024 పురస్కారాన్ని తాతా సందీప్ శర్మకు కేవీఎస్ సాహిత్య పురస్కారం 2023ను బుద్ధ ప్రసాద్ చేతుల మీదుగా అందజేశారు. తొలుత నాట్యాచార్య గండికోట రాజేష్ శిష్య బృందం ప్రదర్శించిన స్వాగత నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా సంస్థ పక్షాన బుద్ధ ప్రసాద్‌ను సత్కరించారు. సభకు కేవీ సత్యనారాయణ అధ్యక్షత వహించగా సాహిత్య మండలి ప్రధాన కార్యదర్శి పుల్లాభొట్ల పురుషోత్తం స్వాగతం పలికారు. కార్యక్రమంలో అతిథులుగా ఆలపాటి నాగేశ్వరరావు, గుప్తా ఫౌండేషన్ మేనేజర్ కె.శ్రీనివాస్, నగరంలోని ప్రముఖులు, సాహితీవేత్తలు, కళాకారులు, కళాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పీఎం విశ్వకర్మ యోజనపై నిర్లక్ష్యం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): కేంద్ర ప్రభుత్వం సంప్రదాయ హస్తకళలను ప్రోత్సహించేందుకు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం అమలులో జిల్లా యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ ధర్మపీఠం ప్రధాన సంచాలకుడు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం ప్రధాన కార్యదర్శి అప్పలభక్తుల శివకేశవరావు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పథకం ప్రారంభించి ఏడాది పూర్తయినా ప్రణాళికాబద్ధంగా పథకం అమలుపై అధికారులు శ్రద్ధ వహించడం లేదన్నారు. ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందాల్సిన సంప్రదాయ ప్రధాన వృత్తులు, ఉప వృత్తులవారికి అవగాహన కల్పించడంలో యంత్రాంగం విఫలమైందన్నారు. పథకం పక్కదారి పట్టి వంశపారంపర్య హస్తకళాకారులకు బదులు సంప్రదాయేతర టైలరింగ్, తాపీ పని వారు భారీగా దరఖాస్తు చేశారని తెలిపారు. ఏలూరు జిల్లా వారు పక్క జిల్లాలో శిక్షణకు వెళ్ళడం వ్యయప్రయాసలతో కూడుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం జిల్లాలోని లబ్ధిదారులకు ఏలూరులో శిక్షణ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రి మహోత్సవాలు


పవర్‌పేట కాశీ అన్నపూర్ణ


బావిశెట్టివారి పేట కనకదుర్గమ్మ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : నగరంలో శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఉదయం అమ్మవార్లకు విశేష పూజలు, కుంకుమార్చనలు చేశారు. స్థానిక పవర్‌పేట కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో ఉదయం శ్రీచక్రార్చన నిర్వహించారు. అమ్మవారికి కాత్యాయని దేవి అలంకారం చేశారు. సాయంత్రం కామాక్షి కోలాట భజన మండలి ఆధ్వర్యంలో కోలాట ప్రదర్శన చేశారు. అర్చకులు విశేష పూజలు చేశారు. బావిశెట్టి వారి పేట కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి అన్నపూర్ణ అలంకరణ చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సీహెచ్ చిన నాగేశ్వరరావు కార్యక్రమాలు పర్యవేక్షించారు.

అక్రమ డిప్యుటేషన్ రద్దు చేయాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): వర్క్ అడ్జెస్ట్‌మెంట్ పూర్తయిన తరువాత ఏలూరు మండలంలోని పైడి చింతపాడు ఎంపీయూపీ స్కూల్‌లో పని చేస్తున్న ఎస్‌జీటీ ఎస్ శేషారత్నం సర్‌ప్లస్ కానప్పటికీ ఎంఈఓ నగరంలోని వైఎస్‌ఆర్ కాలనీ ఎంపీపీ స్కూల్‌కు డిప్యూటేషన్‌పై పంపడం అక్రమమని, దీనిని వెంటనే రద్దు చేయాలని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గెడ్డం సుధీర్ పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. శేషారత్నం అనే టీచర్ పని చేస్తున్న పైడి చింతపాడు పాఠశాలలో 50 నుంచి 60 మంది విద్యార్థులు 1 నుంచి 8వ తరగతి వరకు చదువుతున్నారని, ఆమెకు డిప్యూటేషన్ వేయడంతో ఆ పాఠశాలలో 1 నుంచి 8 తరగతులు చదివే విద్యార్థులకు నలుగురు ఉపాధ్యాయులు (వారిలో ఇరువురు ఎంటీఎస్ ఉపాధ్యాయులు) మాత్రమే బోధన చేయాల్సిన పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఎంఈఓ, డీఈఓల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని తెలిపారు. పైడి చింతపాడుకు మరో ఉపాధ్యాయుడిని డిప్యూటేషన్‌పై నియమించాలని కోరినా స్పందించకపోవడం దారుణమని పేర్కొన్నారు. ఆ పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా పని చేస్తున్న రామరాజు వచ్చే డిసెంబర్ నెలలో పదవీ విరమణ చేయనున్నారని, అప్పుడు ఆ పాఠశాలలో ముగ్గురు మాత్రమే బోధించాల్సి వస్తుందని వివరించారు. దీనిపై కమిషనర్ వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

8న కౌలు రైతుల రాష్ట్ర సదస్సు


కౌలు రైతుల సదస్సు కరపత్రం విడుదల చేసిన నాయకులు

ఏలూరు (టూటౌన్) : ఈ నెల 8న విజయవాడలో నిర్వహించే కౌలు రైతుల రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. స్థానిక జెడ్పీ అతిథి గృహం ఆవరణలో రైతు సంఘం, కౌలు రైతుల సంఘం నాయకులు కౌలు రైతుల రాష్ట్ర సదస్సు కరపత్రం శనివారం విడుదల చేశారు. శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల కారణంగా పంటలు దెబ్బతిని కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయారని, అప్పులు చేసి పెట్టుబడి పెట్టిన దిక్కుతోచని స్థితిలో ఉన్నారని చెప్పారు. కౌలు రైతుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 8న ఉదయం 10 గంటలకు విజయవాడలోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో కౌలు రైతుల రాష్ట్ర సదస్సు ఏర్పాటుచేస్తున్నట్టు చెప్పారు. కౌలు రైతుల పేరుతోనే ఈ క్రాప్ చేసి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వరికి ఎకరాకు రూ.25 వేలు, వాణిజ్య పంటలకు పెట్టిన పెట్టుబడిని బట్టి రూ.60 వేలు నుంచి రూ.లక్ష వరకు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. అన్నదాత సుఖీభవ పథకం పెట్టుబడి సాయం రూ.20 వేలు వెంటనే రైతులు, కౌలు రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులు, సాగుదారుల రుణాలను రీ షెడ్యూల్ చేసి కొత్తగా పంట రుణాలను ఇవ్వాలని కోరారు. పంటల బీమా వాస్తవ కౌలు రైతులకే అందించాలన్నారు. కార్యక్రమంలో పలువురు కౌలు రైతులు, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖలో బదిలీపై ఆరోపణలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల సాధారణ బదిలీలపై నిషేధాన్ని ఎత్తివేసి బదిలీలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అనంతరం తిరిగి నిషేధం విధించింది. అయినప్పటికీ విద్యుత్ సంస్థలో శనివారం జరిగిన ఒక బదిలీ ఏలూరు విద్యుత్ సర్కిల్‌లో చర్చనీయాంశంగా మారింది. ఏలూరు విద్యుత్ సర్కిల్ పరిధిలో డీపీఈ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పని చేస్తున్న కే మధుకుమార్‌ను నరసాపురం ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా బదిలీ చేస్తూ ఈపీడీసీఎల్ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ శనివారం ఆదేశాలిచ్చారు. నరసాపురంలో ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పని చేస్తున్న బీ సురేష్ కుమార్‌ను ఏలూరు డీపీఈ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా బదిలీ చేశారు. సురేష్ కుమార్ మరో 6 నెలల్లో పదవీ విరమణ చేయనున్నారు. నిబంధనల ప్రకారం ఏడాదిలోపు పదవీ విరమణ చేసే ఉద్యోగులకు బదిలీల నుంచి మినహాయింపు ఉంటుంది. దీని ప్రకారమే ఇటీవల నిర్వహించిన సాధారణ బదిలీలకు సంబంధించిన జాబితాలో సురేష్ కుమార్ పేరు చేర్చలేదు. ప్రస్తుతం జరిగిన బదిలీకి సంబంధించి రూ.7 లక్షల వరకూ చేతులు మారాయని, అందువల్లనే పదవీ విరమణకు దగ్గరలో ఉన్న అధికారిని బలవంతంగా బదిలీ చేశారని చెప్పుకుంటున్నారు. ఈ బదిలీకి సంబంధించి నరసాపురంలో స్పాట్ బిల్లింగ్ కాంట్రాక్టర్‌గా పని చేస్తున్న ఒక వ్యక్తి చక్రం తిప్పి కీలకంగా వ్యవహరించి వ్యవహారాన్ని పూర్తి చేసినట్లు చర్చించుకుంటున్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి


ఇఫ్టూ రాష్ట్ర సదస్సు కరపత్రం విడుదల చేసిన నాయకులు, కార్యకర్తలు

ఏలూరు (టూటౌన్): కేంద్రంలోని మోదీ, షా ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ప్రభుత్వరంగ సంస్థలను పరిరక్షించాలని, ఈ నెల 18న విజయవాడలో నిర్వహించే ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని ఇఫ్టూ నగర సహాయ కార్యదర్శి గడసాల రాంబాబు, హమాలీ జట్టు సంఘ కోశాధికారి ముంగం అప్పారావు కోరారు. స్థానిక ఐఎంహెచ్ఎ హాలు సెంటరులో ఇఫ్టూ అనుబంధ జట్టు కార్మిక సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ ముద్రించిన కరపత్రం శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోని కార్మిక వర్గం తమ హక్కులు సౌకర్యాల కోసం భారతదేశ కార్మిక వర్గం తరతరాలుగా పోరాటాలు ప్రాణత్యాగాలు రక్తతర్పణలు అర్పిస్తూనే ఉన్నారు. రెండో సారి 2019 సంవత్సరంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దుచేసి కార్మిక హక్కులు హరించే నాలుగు లేబర్ కోడ్‌లను ప్రవేశపెట్టారన్నారు. మూడు క్రిమినల్ చట్టాలను తీసుకొచ్చారని, మూడోసారి మోదీ సర్కార్ దేశంలోని కార్మిక వర్గంపైనా, ప్రజలపైనా పెను దాడి చేయడానికి అతివేగంగా ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 18న నిర్వహించే ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జగ్గరపు రమణ, సంధకం అప్పారావు, అన్నవరం, విష్ణు, ఈశ్వరరావు, ఆర్ రామ్మోహన్, కె.మాణిక్యాలరావు, జి.నాగేశ్వరరావు, ఎస్ దుర్గారావు, లోకరాజు, కె.శ్రీను, పండు, ఎస్ రమణ, యాదగిరి ఈశ్వరరావు, పి.సాయి పాల్గొన్నారు.

మహిళను గంటలోనే ఇంటికి చేర్చారు


మహిళను బంధువులకు అప్పగిస్తున్న పోలీసులు

ఏలూరు టౌన్: ఏలూరు పోణంగి గ్రామానికి చెందిన మహిళ ఇంట్లో వారితో గొడవపడి ఎవరికీ చెప్పకుండ బయటకు వెళ్లిపోయింది. ఏలూరు రూరల్ పోలీసులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి ఒక గంట వ్యవధిలోనే ఆమెను గుర్తించి, కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోణంగి గ్రామానికి చెందిన కొప్పుల అఖిల తన భర్త మహేష్‌తో గొడవపడి శుక్రవారం పుట్టింటికి వెళ్లిపోయింది. ఇంటికి వచ్చిన కుమార్తెను తల్లిదండ్రులు మందలించారు. తీవ్ర మనస్థాపంలో ఆమె చనిపోవాలనే నిర్ణయంతో మూడు నెలల చిన్నారితో సహా ఇంటినుంచి వెళ్లిపోయింది. వెంటనే తల్లిదండ్రులు పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ ఎస్సై దుర్గాప్రసాద్ సాంకేతిక పరిజ్ఞానంతో ఆమె ఎక్కడ ఉన్నదీ తెలుసుకుని సిబ్బందిని పంపారు. ఆమెను గుర్తించి కుటుంబ సభ్యులకు క్షేమంగా అప్పగించారు.

క్లుప్తంగా

డీపీఓకు కార్యదర్శుల శుభాకాంక్షలు


డీపీఓ అనురాధకు శుభాకాంక్షలు తెలుపుతున్న పంచాయతీ కార్యదర్శులు

ఏలూరు(మెట్రో) : జిల్లా పంచాయతీ అధికారిగా బాధ్యతలు చేపట్టిన రుజ అనురాధకు శనివారం పంచాయతీ కార్యదర్శుల సంఘం సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. వీరిలో వీజీఎంవీఆర్ కృష్ణారావు, పి.నాగేశ్వరరావు, కేవీఎల్ తనూజ, యూఎంఎస్ సూర్య, టి.ముత్తయ్య, సాయికృష్ణ, కృష్ణంరాజు, వినోద్‌కుమార్, జితేంద్ర, వర్మ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా డీపీఓ అనురాధ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, జిల్లాను ప్రథమ స్థానంలో ఉంచేందుకు కృషి చేయాలన్నారు.

కృత్రిమ కాళ్ల తయారీ కేంద్రం ప్రారంభం


కృత్రిమ కాళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): కృతిమ కాళ్ల తయారీ కేంద్రంతో వివిధ కారణాలతో కాళ్లు కోల్పోయిన వికలాంగులకు ఎంతో మేలు జరుగుతుందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఏలూరు హేలాపురి లయన్స్ క్లబ్ అనుబంధ సంస్థ హేలాపురి లయన్స్ సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక న్యూ అశోక్ నగర్‌లోని లయన్స్ మల్టీ సర్వీస్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కృత్రిమ కాళ్ల తయారీ కేంద్రాన్ని చంటి లయన్స్ జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబుతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ కేంద్రంలో నమోదైన వారికి అతిథుల చేతులమీదుగా కృత్రిమ కాళ్లు అందించారు. కార్యక్రమంలో లయన్స్ జిల్లా పూర్వపు గవర్నర్ వి.మురళీమోహన్‌రావు, జిల్లా ఉప గవర్నర్లు పాపారావు నాయుడు, డి.సుబ్బారావు, ఇంటర్నేషనల్ డైరెక్టర్ (ఎండార్సి) పి.సుభాష్ బాబు, రీజియన్ చైర్మన్ కృష్ణమోహన్, జోన్ చైర్మన్ డి.సరస్వతి, క్లబ్ ప్రెసిడెంట్ పీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

సంపాదిత సెలవులు ఇవ్వాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉపాధ్యాయులకు ఏడాదిలో 30 రోజులు సంపాదిత సెలవులు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఏలూరు జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రామారావు, బి.రెడ్డిదొర ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు వెకేషన్ డిపార్ట్‌మెంట్‌కి చెందిన వారని వారికి సంవత్సరానికి ఆరు రోజులు మాత్రమే సంపాదిత సెలవు జమవుతుందని, నేడు సెలవుల్లోనే శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారని పేర్కొన్నారు. సెలవులైనప్పటికీ విద్యార్థుల వివరాలను నమోదు చేయాల్సి వస్తోందని, యాప్‌లలో అవసరమైన సమాచారం నమోదు చేయడం వంటి అనేక కార్యక్రమాలు చేయాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు.

తోట ఎడ్వర్డ్‌కు లయన్స్ పురస్కారం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): లయన్స్ క్లబ్ ద్వారా ఏలూరు పరిసర ప్రాంతాల్లో విశేష సేవా కార్యక్రమాలు నిర్వహించిన తోట ఎడ్వర్డ్‌కు 2023-24 సంవత్సరానికి ఇంటర్నేషనల్ లైయన్స్ క్లబ్ ప్రతిష్టాత్మకమైన పురస్కారాన్ని ప్రదానం చేసింది. ఏలూరు సెంట్రల్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా ఎడ్వర్డ్ బృందం 2023-24 సంవత్సరంలో ఉచిత వైద్య శిబిరాల నిర్వహణతోపాటు, పేదల విద్యాభివృద్ధికి సహాయ సహకారాలు అందించారని, ప్రకృతి వైపరీత్యాలు, వరదల సమయాల్లో బాధితులకు నిత్యావసర వస్తువులతో పాటు గృహోపకరణాలు అందించి ఆదుకున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఎడ్వర్డ్‌కు శనివారం నగరంలో నిర్వహించిన కార్యక్రమంలో 98 ఎంటీఎస్ ఉపాధ్యాయుల సంఘం ప్రతినిధులు జ్ఞాపికను అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎండీ పాషా, బి.శర్మ, కె.కరుణానిధి, ఎ.ఏసుపాదం, షేక్ బాజీ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి కేసులో పురోగతి

9 మందిని అరెస్ట్ చేసిన అధికారులు

ఏలూరు టౌన్: ఏలూరు తంగెళ్లమూడి ప్రాంతంలో ఎంఆర్‌సీ కాలనీలో గంగానమ్మ జాతర ఊరేగింపులో రెండు వర్గాలు కత్తులు, రాడ్లతో రెచ్చిపోగా మానుకొండ వెంకటేశ్వరరావు అలియాస్ నాగేంద్రరావు అనే వ్యక్తిపై ప్రత్యర్థి వర్గం దాడి చేసింది. సెప్టెంబర్ 29న అర్ధరాత్రి చోటుచేసుకున్న ఈ ఘటను సంబంధించి పోలీస్ అధికారులు నిందితులను అరెస్ట్ చేశారు. దాడికి పాల్పడిన వ్యక్తుల్లో తంగెళ్లమూడి ఎంఆర్‌సీ కాలనీకి చెందిన వల్లూరి వీరవెంకటసాయికుమార్ అలియాస్ సాయి కుమార్, కబాడీగూడేనికి చెందిన పెనుమునూరి అలియాస్ రాము, జంగారెడ్డిగూడెం దేవులపల్లికి చెందిన నందిపాము సురేష్, కబాడీగూడెంకు చెందిన మందం సునీల్, పరస పవన్‌కుమార్, చోడిమెల్ల చందు అలియాస్ సిద్దు, ఉలసల నాగచైతన్య అలియాస్ చింటూ, ఆముదాల అప్పలస్వామి కాలనీకి చెందిన కోమాకుల సాయికుమార్ అలియాస్ మల్లిపువ్వులు అలియాస్ పూలసాయి, తంగెళ్లమూడికి చెందిన రెడ్లమ్ సందీప్ ఉన్నారు. ఏలూరు నగరంలో దాడులు, నేరాలకు పాల్పడితే సహించేది లేదని డీఎస్పీ శ్రావణ్‌కుమార్ హెచ్చరించారు. నిందితులను అరెస్ట్ చేసిన అధికారులను ఎస్పీ కేపీ శివకిషోర్ అభినందించారు.